ప్రజాస్వామ్యానికి బలం
ప్రత్యామ్నాయ రంగస్థలం

ప్రచురణ :

ప్రత్యామ్నాయ ప్రస్థాన కేంద్రం

ప్రజాస్వామ్యానికి బలం ప్రత్యామ్నాయ రంగస్థలం

వ్యాస సంపుటి

గౌరవ్

ప్రచురణ

ప్రత్యామ్నాయ ప్రస్థాన కేంద్రం

ముద్రణ :

మార్చి 27, 2025

(ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా)

మూల్యం : అమూల్యం

© కాపీ లెఫ్ట్

సర్వ హక్కులు సమాజానివి

వివరాలకు

gouravmeka@gmail.com

అంకితం

అత్యున్నతమైన భావాలు, అవి ఎన్నయినా కానివ్వండి. వాటి ప్రామాణికత తేలాల్సింది వ్యవస్థలోని సామాన్యుడి స్థితిని అవెంత ఉన్నతీకరిస్తున్నాయనే సూత్రం ఆధారంగానే కానీ ఎంత మంది మేధావులు ఎంత పాడారనే సూత్రంతో కాదు.

మానవాళి భౌతిక స్థితిగతుల్ని మెరుగు పరిచడానికి పనికి రాని తత్వశాస్త్రం అదెంత గొప్పదైనా ఒత్తిదే. ప్రపంచ పీడిత ప్రజల కోసం అలాంటి నిర్మాణాత్మక ప్రత్యామ్నాయ ప్రజా విముక్తి శాస్త్రాలకు రక్త మాంసాలు కూర్చిన మహోన్నతులైన ఇరువురికీ...

మనసులోని ఇష్టంతో
ఈ కృతినిలా....



పాలో ఫెర్రీ
(1921 – 1997)

అగస్టో బోల్
(1931 – 2009)

ముందుమాట

"*Modern life which presents complex Social conditions is neglected by play wrights*.' అనగా అతి క్లిష్టమైన సాంఘిక పరిస్థితుల్ని ప్రదర్శించే ఆధునిక జీవితాన్ని నాటక రచయితలెవ్వరూ కథా వస్తువుగా స్వీకరించడం లేదు అని. కొద్ది మినహాయింపు లతో నాటక రచయితల గతి నాటికి నేటికీ ఒక్కలాగే ఉంది."

– గురజాడ సాహిత్యం పై శ్రీశ్రీ సమీక్ష.

బాగా చిన్నప్పుడు స్కూల్లో ఏదో శిబి చక్రవర్తి నాటకంలో చేసినట్టు గుర్తు. తర్వాత మా ఊరి సెంటర్లో ఏదో పౌరాణిక నాటకం ఆడుతుంటే వెళ్లి రోడ్డు మీదనే కూర్చుని చూస్తున్నాను. మా నాన్న వెనకనుండొచ్చి తట్టి లేపి ఇంటికి పదమన్నాడు. తర్వాత ప్రతి దసరాకి రైల్వే స్టేషన్ వద్ద జరిగే రాత్రి నాటకాలకు వెళ్లే వాడ్ని. కానీ అంతా చూడాలంటే రాత్రంతా వుండాలి. చిన్నవాడిని కదా, నిద్రకి ఆగలేకపోయేవాడ్ని.

పదేళ్లకు మించకుండా ఇంట్లో ఉన్న కన్యాశుల్కం ఇంకా వర విక్రయం, చలం నాటికలు వంటివి కొన్ని చదివేశాను. బహుశా వాటి ప్రభావం ఎంతో కొంత ఉండుంటుంది. హై స్కూల్ లో ఉపవాచకంగా షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనిస్ ఉండేది. షైలాక్ పాత్ర ఇప్పటికీ జ్ఞాపకం. తర్వాత చాలా కాలం జీవిత నాటకానికి సరిపోయింది. జీవితం, ఎంత విశాలమైన వేదికో. ఎన్ని పాత్రలో, ఇంకెన్ని యాత్రలో.

సామాజిక కార్యకర్తగా సాంస్కృతిక రంగాన్ని అధ్యయనం చేసే పనిలో భాగంగా మళ్ళీ ఇలా నాటక రంగానికి వచ్చాను. దశాబ్ద కాలంగా. సమాజ సాంస్కృతిక పరిణామాన్నీ, వికాసాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాను. అందులో భాగంగా అనేక పరిమితుల్లో ఏవో కొన్ని ఆచరణాత్మక కార్యక్రమాల్ని తోచిన రీతిలో రూపొందించుకుని ముందుకు సాగుతున్నాను. అలా ఎన్నుకున్నదే ఇదిగో ఈ ప్రత్యామ్నాయ రంగస్థలం.

ప్రత్యామ్నాయ సినిమా లాగానే ప్రత్యామ్నాయ నాటకం కూడా ఒక ప్రత్యేకమైన అభిమానంతో చేయాల్సిన ప్రయత్నం. ఏ కళ ఐనా మనిషి క్రియాశీలతను మానవీయంగా మలచ గలగాలి. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేర్చగలగాలి. నాటకం సజీవ రూపకం. ఆంతరంగిక ప్రేరకం.మనిషికీ మనిషికీ మధ్య ఓ సహృదయమైన సాంస్కృతిక వాహకం. అలాంటి మాధ్యమాన్ని మరింత బలోపేతం చేసుకోడం మనందరి ఉమ్మడి బాధ్యత.

మొదటి ముస్లిం కమ్యూనిస్టు వైద్యురాలు డా. రషీద్ జాహాన్ నాటికను అనువదించడం మొదలు, మహిళలకు మాత్రమే నిర్వహించిన ప్రత్యామ్నాయ రంగస్థలం కార్యశాల వరకూ ఎన్నో అనుభవాలు. మరెన్నో ఆలోచనలు. ప్రత్యామ్నాయ రంగస్థలం కార్యకర్తగా నాటకం జీవితం నుండి వేరుగా వుండరాదనేదే నా అభిప్రాయం. దానికి లోబడే ఐనంతలో ఈ చిరు ప్రయత్నం.

ముఖ్యంగా గతేడాది బెంగుళూరులో రాధా రామస్వామి ఫెసిలిటేటర్ గా నిర్వహించిన 'Theatre of the Oppressed' వర్క్ షాప్ నాకు ఎంతగానో ఉపయోగ పడింది. తెలుగు నాటకం చరిత్ర గురించి చేసిన అధ్యయనం కూడా ఒక సామాజిక సాంస్కృతిక కార్యకర్తగా నా పరిధిని విస్తృతం చేసుకోడానికి తోడ్పడింది.ఆ క్రమంలో అప్పుడప్పుడు రాసిన రైటప్ లూ, మొదటిసారి చేసిన వర్క్ షాప్ యత్నాల రిపోర్టులను ఇలా ఒక్కదరికి చేర్చడం జరిగింది.

ఇందులో కొన్ని ఈసరికే ప్రచురించబడ్డాయి. ఐనా, ఇదో ప్రయోగాత్మక ప్రాథమిక ప్రయత్నం మాత్రమే.ఈ మొత్తం వ్యవహారం సమిష్టి కృషిలో భాగమే కానీ నా ఒక్కడి తతంగం కాదని నా భావన. అందుకు ప్రేరణ కలిగించిన అందరికీ పేరుపేరునా హృదయపూర్వక శుభాకాంక్షలు.సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే పని అదేదైనా వ్యవస్థ పురోగతిలో భాగమే అనేది నా భావన. అందుకోసమే ఈ రచన.

.చదివాక విమర్శలకు స్వాగతం.

(మార్చి 16 **World To Day**, 27 ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఇది ప్రచురించడం జరుగుతోంది.)

- గౌరవ్

ప్రజాస్వామ్యానికి బలం !
ప్రత్యామ్నాయ రంగస్థలం !!

"రంగస్థలం మరణించిందా ?" 60 వ దశకంలో పాశ్చాత్య ప్రపంచంలో తలెత్తిన ప్రశ్న ను ఇవాళ తెలుగు సాంస్కృతిక రంగం ఎదుర్కొంటోందా..? నిదానంగా మొదలైన తెలుగు సారస్వత వికాసం ఒక దశలో ఉవ్వెత్తున ఎగిసిపడి లక్షలాది మంది ప్రజల్ని చైతన్యపర్చడం ఒక మరుగుపడిన గత చరిత్ర గానే మిగలనుందా..? ఒకవేళ అదే నిజమైతే అందుకు కారణాలేమిటి?

సుమారు 2500 సంవత్సరాల చరిత్ర కల ఒక కళా ప్రక్రియ అంత సులువుగా అంతమయ్యే అవకాశాలు లేవు. ఐతే, ప్రస్తుతం ఉన్న సాంస్కృతిక స్తబ్దత కి కారణాల్ని అన్వేషించడం ఒక తప్పనిసరి బాధ్యతాయుత కర్తవ్యం కావాలని మాత్రం సాంస్కృతిక శక్తులు గుర్తించాలి.

ప్రజా రంగస్థలం విభిన్నమైన ప్రజాతంత్ర ప్రయోగాల వేదిక. విస్తారమైన వ్యక్తీకరణలకి ఒక విశాలమైన మాధ్యమం. అనేక ప్రగతిశీల దృక్పథాల ప్రదర్శన నిలయం. నూతన భావాల్ని భావోద్వేగాలతో మిళితం చేసే ఆలవాలం.ఐతే, ఇదంతా చరిత్ర.

ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ ప్రత్యామ్నాయ రంగస్థలం ఒక దగ్గరకొచ్చి ఆగిందనచ్చు. సగటు మనిషి జీవితంతో అవిభాజ్యంగా భాగం కావలసిన సాంస్కృతిక రంగం 'పరాయీకరణ' కి గురయ్యి ఎటూ తేలని ఒక 'గందరగోళం' గా మిగలడం బాధాకరం. మార్పుకు మాధ్యమం కావాల్సిన రంగస్థలం, అన్నీ మూసుక్కూర్చోవడం దేనికి సంకేతం?

"మౌలిక సాహిత్యానికి ఉండవలసిన ప్రధాన గుణం సమకాలీనత. సమకాలీనత లేని రచన ఎంత గొప్పదైనా అది సాహిత్యం అనిపించుకోదు.." అన్న బోయి భీమన్న గారు, "సంగీత, సాహిత్య, నృత్య, చిత్ర, శిల్పకళల సమగ్ర రూపమే నాటకం..." అంటూ, "సత్య హరిశ్చంద్ర నాటకం చూసి ఎందరు సత్య వ్రతులయ్యారో తెలియదు కానీ, పాలేరు నాటకం చూచి వేల మంది పాలేళ్ళు, పాలేరు తనాలు వదిలేసి పాఠశాలల్లో చేరడం మాత్రం వాస్తవంగా జరిగింది." అన్నారు 'పాలేరు' నాటకానికి 'బాణాకర్ర' పేరిట రాసిన ముందుమాటలో.

వాసిరెడ్డి, సుంకరల "ముందడుగు", "మా భూమి" వంటి నాటకాలు ఒక తరం ప్రజా ఉద్యమ వాతావరణాన్ని నిర్దేశించడంలో గొప్పపాత్ర పోషించాయ్. ముఖ్యంగా, నాటి యువతకి దిశానిర్దేశం కావించి రాజకీయ, సామాజిక అవగాహనను పెంపొందించడంలో అవిస్మరణీయమైన అనుసంధాన మార్గంగా ఉన్నాయి.

అటువంటి మహోన్నత మాధ్యమం ఈ రోజు మార్పునే మాటకి భయపడుతూ కేవలం 'ప్రైజ్ మనీ ప్రదర్శనల' కే పరిమితం అయ్యే కాలక్షేప కార్యకలాపంగా మారడమంత సాంస్కృతిక విషాదం మరోటి లేదు.

"ఏం ప్రదర్శిస్తున్నామనేది కాదు 'ఎవరి కోసం', 'ఎవరు' ప్రదర్శిస్తున్నారనేది ప్రధానం" అంటాడు మావో. అణగారిన ప్రజల కోసం, సామాజిక కార్యకర్తల కోసం అనేక నాటకాలు రాసిన జర్మన్ మేధావి, నాటకకర్త, బెర్ట్రోల్ట్ బ్రెహ్ట్ కూడా ఇదే మాటంటాడు.

ప్రసిద్ధి చెందిన ప్రజా విద్యావేత్త, ప్రత్యామ్నాయ విద్యా తాత్వికుడు పాలో ఫెర్రీ "పీడితుల విద్యాశాస్త్రం" అభివృద్ధి చేసిన బ్రెజిల్ లోనే, "పీడితుల కోసం రంగస్థలం" (Theatre of the Oppressed) అనే భావనను విస్తృతం చేసిన ఆలోచనాశీలి ఆగస్తో బోల్, ఆ విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రవేశపెట్టి వృద్ధి చేసాడు. బోల్ ప్రభావంతో అనేకచోట్ల ఈ ప్రయోగాత్మక నాటక ప్రక్రియ పాదుకొంది. మైఖెల్ రోడ్ వంటి రంగస్థల కార్యకర్తలు బోల్ విధానాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ, "Theatre for Community, Conflict & Dialogue" వంటి రచనలు కూడా చేసారు.

ఆధునిక నాటకానికి ఆయువుపట్టు "అభివ్యక్తి". స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో కూడిన ఒక సమాలోచనను సహేతుకంగా నిర్మించడం ఈ ప్రయోగాత్మక రంగస్థల లక్ష్యం. నటనకి సంబంధించినంత వరకు ప్రత్యేక నైపుణ్యాలేవీ దీనికి అవసరం లేదు. జరుగుతున్న నాటకంలో ప్రేక్షకులు ప్రవేశించి అర్ధవంతమైన మార్పులు , చేర్పులు చేసే అవకాశం ఈ 'పీడితుల రంగస్థల' ప్రత్యేకత.

ప్రజా ఉద్యమాలతో పోలిస్తే ప్రజా నాటకం వెనకబడిన నేపథ్యంలో, ప్రత్యామ్నాయం అభివ్యక్తి ప్రధాన సాధనమైన "సంభాషణ" (Dialogue) ని ఒక ప్రజాతంత్ర ప్రచార పనిముట్టుగా మల్చుకోవడం ఈరోజు అన్ని ప్రగతిశీల శక్తుల బాధ్యత.

ఈ క్రమంలో దేశవ్యాప్తంగా గతించిపోతున్న వివిధ నాటక కళా ప్రక్రియల అస్తిత్వానికి సంబంధించి, ఆయా కళారూపాలకి మద్దతుగా వాటిని బహుళ ప్రచారంలోకి తీసుకు వచ్చే ప్రయత్నాలు కూడా ఇతరేతర రాష్ట్రాలలో ఆశాజనకంగా జరుగుతున్నాయి.

ప్రత్యామ్నాయ సినిమా లాగానే ప్రత్యామ్నాయ నాటక కళా రంగాల్లో జరిగిన కృషిని నమోదు చేయాలనే ఒక స్పృహ ఈరోజు స్పష్టంగా కనిపిస్తోంది. ఆ దిశగా డాక్యుమెంటరీలు తీయడం, సాహిత్యం ప్రచురించడం మొదలైనవి ఆ మేరకు సాంస్కృతిక ఆరోగ్యానికి చిహ్నాలే.

దేశంలో సప్దార్ హష్మి మొదలుకొని గోరఖ్ పాండే దాకా, తెలుగులోగురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం దగ్గర నుండి షేక్ నాజర్, గరికపాటి రాజారావు ల వరకూ ఎంతోమంది అభ్యుదయ రంగస్థల కార్యకర్తలను పేర్కొనవచ్చు కానీ వర్తమానంలో ఆ చింతనాత్మక వారసత్వాన్ని కొనసాగించడంలో మనమెక్కడ ఉన్నామనేదే అసలు ప్రశ్న. దేశంలోని కొన్ని రాష్ట్రాలలో కనీసం ప్రయోగాత్మక ప్రయత్నాలైనా జరుగుతుండగా, తెలుగు రాష్ట్రాలలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. గడిచిన దశాబ్దాలలో సొంతంగా ప్రజాదరణ పొందిన ఒక్క ప్రత్యామ్నాయ నాటకం కూడా రాలేదంటే రంగస్థల రచయితల్లో పేరుకుపోయిన మూస ధోరణులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

"నేర్చుకోవడం మానేసినవాళ్ళు బోధించడం ప్రారంభించడం ఈ శతాబ్దపు దౌర్భాగ్యం." అంటారు ప్రఖ్యాత నాటకవేత్త బెర్నార్డ్ షా. ఉన్న కొద్దిమంది కళాకారులు, రచయితలు కూడా అవార్డుల కోసమే రాసే మూసకూ, వేరే భాషల్లో జరుగుతున్న ప్రయత్నాల్ని పనిగట్టుకుని ప్రచారం చేస్తూ సుఖాలకి అలవాటు పడిన భాషకూ మాత్రమే పరిమితం అయ్యారు.

కులతత్వం, మతోన్మాదం, పురుషాధిక్యత తాండవిస్తోన్న యాంత్రిక సమాజంలో మానవీయ తాత్విక స్పృహను ప్రవేశపెట్టగల సత్తా సాంస్కృతిక రంగానికే ఉంది. అందుకోసం, అణగారిన వర్గాల నుండి దళిత బహుజన ఆదివాసీ మైనారిటీ, స్త్రీల నుండి ఈ "సారస్వత స్పృహ" అభివృద్ధి కావలసిన అవసరం ఎంతైనా ఉంది. వామపక్ష, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న నూతన కళా తాత్విక ధోరణులను పనికట్టుకుని ప్రత్యేకంగా అధ్యయనం చేయడం తక్షణావశరం.

అనేక అవాంఛనీయ సంక్షోభాల నడుమ కొట్టుమిట్టాడుతున్న సగటు మనిషికి సాంస్కృతిక రంగం అండంగా నిలవాలి. రైతులు, విద్యార్థులు, దళిత బహుజనులు, మహిళలు, ఇతర పీడిత సమూహాలంతా కార్పోరేట్ సినిమాల ప్రచారం, అమానవీయ ద్వేషపూరిత, కుతంత్ర టీవీ సీరియళ్ళ మాయలోంచి బయటపడి ఐక్యంగా ప్రత్యామ్నాయ కళా ప్రక్రియలని అభివృద్ధి చేసుకోవాలి. స్పష్టమైన నిర్మాణాత్మకత కలిగిన ప్రత్యామ్నాయ రంగస్థల వేదికల దిశగా అది జరిగినపుడే ఒక విశాలమైన ప్రత్యామ్నాయ కళా రూపకంగా నాటకరంగం బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితం.)

అణగారిన ప్రజల ఆయుధం – ప్రత్యామ్నాయ నాటకం

పునఃమానవీకరించబడే సమాజం కోసం !
పీడితుల దీక్షాస్థం, ప్రత్యామ్నాయ దీక్కోణం !!
ప్రజా సాంస్కృతిక రంగస్థలం !!!
అగస్తో బోల్, "థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్" !!!!

If the structure does not permit dialogue, the structure must be changed.

- Paulo Freire

Theatre is a form of knowledge ; it should and also be a means of transforming society. Theatre can help us build our future, rather than just waiting for it.

-Augusto Boal

చాలా సంవత్సరాల నుండి వింటూ,చదూతూ వస్తున్నదే కానీ సిద్ధాంతాల శక్తిని అంచనా వేసేది ఆచరణే కదా. థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్. పీడితుల రంగస్థలం అనొచ్చేమో. ప్రత్యామ్నాయ ప్రస్థానంలో భాగంగా ఆరంభ కాలంలోనే నా అన్వేషణకు పదును పెట్టిన ఇరువురు బ్రెజిల్ ఆలోచనాపరులు, ఒకరు పెడాగజి ఆఫ్ ది అప్రస్డ్ సిద్ధాంతవేత్త ఫాలో ఫెర్రీ, రెండు థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్ రూపకర్త ఆగస్టో బోల్. రెండూ అణిచివేత నుంచి ప్రపంచాన్ని విముక్తం చేసే ఆయుధాలు !

బెంగుళూరులోని ఇండియన్ సోషల్ ఇన్స్టిట్యూట్‌లో CCDC (Centre for Community Dialogue & Change) ఆద్వర్యంలో రాధా రామస్వామి, రవిల సారధ్యంలో జరిగిన గొప్ప ప్రయోగం Breaking Patterns, Creating Change. ఇందులో సాంప్రదాయ నాటకం మీదనున్న భ్రమల్ని పటాపంచలు చేసి ప్రజాతంత్ర కళని కళ్ళకి కట్టి చూపించడమే కాదు, బహిరంగ ప్రదర్శనతో పాటు పిల్లలతో కలిసి పనిచేసే కార్యాచరణకు కంకణం కడతారు !

మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, తమిళ నాడు, జమ్మూ, చత్తీస్‌గఢ్, ఒడిషా, బెంగాల్ తదితర ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు ముప్పై మంది మధ్యన తెలుగు ప్రాంతం నుండి నేను పాల్గొన్నాను. ప్రత్యామ్నాయ ప్రజాకళను అధ్యయనం చేయడం, ప్రచారం చేయడమే లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న సాంస్కృతిక కార్యకర్తలు, సంస్థలు తమ సర్వజ్ఞతను పక్కనపెడితే త్వరలోనే తెలుగు ప్రాంతాల్లో ఈ అంశం గురించిన కార్యక్రమాలు జరుగుతాయని ఆశ !

70 దేశాలకు పైబడి అమలు చేస్తున్న అణగారిన ప్రజల పక్షాన నిలిచిన ఈ శక్తివంతమైన అభివ్యక్తిని అమెరికా లోని Mandala Center for Change కి చెందిన మార్క్ వీన్‌స్టెట్ నుండి నేర్చుకుని దశాబ్దాలుగా ఆచరణలో పెడుతున్నారు. CCDC కి రాధా, వాళ్ళబ్బాయ్ రవి వ్యవస్థాపకులు. నిరంతరం ప్రత్యామ్నాయ ప్రజారంగ స్థలం పై పనిచేసే ఉత్సాహం ఉన్నవారు. నిజానికి ఐదేళ్ళ క్రితమే రవి ఆద్వర్యంలో జరిగిన ఒక వర్క్‌షాప్‌లో పాల్గొనాల్సింది, కాలేదు !

కెనడాకి చెందిన డేవిడ్ డైమండ్ సారధ్యం లోని 'థియేటర్ ఫర్ లివింగ్' (TFL) మొదలుకొని న్యూయార్క్‌లోని 'థియేటర్ ఆఫ్ అప్రస్డ్ '(NYC)వరకూ అనేక దేశాల్లో భిన్న ప్రయోగాలు జరుగుతున్నాయి. మన దేశంలో కూడా అనేక చోట్ల ఈ థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్ కోసం పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలు ఉన్నాయి. బెంగాల్‌కి చెందిన థియేటర్ సంస్థ 'జన సంస్కృతి' ముక్తధార పేరుతో ప్రజా రంగస్థల ప్రదర్శన కార్యక్రమం కూడా నిర్వహిస్తోంది!

ఆటలు, కేకలతో ఆరంభమయిన ఈ కార్యక్రమం ఎంత శక్తివంతమైనదో, ఆధిపత్య వ్యవస్థల్ని ఎంత సమర్థవంతంగా ఎదుర్కోగలదో అర్థం చేసుకుంటే ప్రత్యామ్నాయ సాంస్కృతిక స్రవంతిలో దీనికున్న ప్రాధాన్యత, విశిష్టత బోధపడతాయ్. ఈ అణగారిన ప్రజా రంగస్థలం ప్రధాన లక్ష్యం పునఃమానవీకరించబడటం. మళ్ళీ మళ్ళీ మానవీకరణ చెందడం (Re-humanize Ourselves) అంటాడు బోల్. అదర్థమైతే అసలు ఇదెందుకో అర్థమవుతుంది !

మన జీవితాల్ని అర్థవంతంగా మల్చుకోడానికి అవసరమైన బలమైన ముద్ర వేయగలిగే గాఢత కలిగిన భావాలను ఆహ్వానిద్దాం రండి. వ్యక్తిగత, సామాజిక, రాజకీయ పాశ్వాలన్నిటినీ సమిష్టిగా ప్రజాస్వామికం చేసుకుందాం పదండి. నిజమైన మార్పు ఎప్పుడూ నిజాయితీగానే ఉంటుంది. నిష్కల్మషంగానే వస్తుంది. నిరాడంబరంగానే జరుగుతుంది. అసమానతా సమాజంలో అన్నిరకాల వివక్షతలకీ వ్యతిరేకంగా, మానవీయ మహామార్పుకి మనవంతు యత్నిద్దాం సిద్ధం కండి !

(ప్రజారంగస్థలం ప్రతి ఒక్కరిదీ. అన్ని రంగాలదీ.మార్పు మనతోనే మొదలవ్వాలని తపించే వారందరిదీ వేదిక. మార్పు కోసం స్వచ్ఛందంగా శ్రద్ధ, సమయమూ ఇవ్వగలిగితే చాలు.ఆసక్తున్న వారి కోసం ఆన్లైన్లో అవసరమైన సమాచారం ఉంది.కావల్సినంత మెటీరియల్, పుస్తకాలు ఉన్నాయి. ఔత్సాహికులు సంప్రదించవచ్చు. ఎంతోకాలం నుండి అనుకుంటున్న మానవీయ మార్పు మాధ్యమం, థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్ గురించిన చిరు పరిచయంతో ఈ చిన్న రైటప్ !)

(FB లో వ్రాసిన రైటప్)

పీడితుల రంగస్థలం... సగటు ప్రేక్షకుడికి దిక్సూచి

నాలుగు దశాబ్దాల క్రితం ప్రముఖ బెంగాలీ నాటక రచయిత బాదల్ సర్కార్ అతి కొద్ది ఖర్చుతో ఆరు బయట తక్కువ మందితో ప్రదర్శించగల స్ట్రీట్ ప్లేని కొత్త కళారూపంగా దేశం మీదికి వదిలినప్పుడు మా తరం ఆశ్చర్యపోయింది. నిర్వహణ ఖర్చులు భరించలేక అప్పటికే నాటకరంగం కునారిల్లిపోతున్న దశలో ఈ సరికొత్త స్ట్రీట్ ప్లే ఎంతో మంది ఔత్సాహిక నాటక రచయితలకు ప్రేరణను అందించింది. దాని ప్రభావంతో తిరుపతిలో అప్పట్లోనే, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావును పదవీచ్యుతుడిని గావించిన తెరవెనుక రాజకీయాలపై కళారంగంపై అభినివేశం ఉన్న మిత్రులు, మా సీనియర్ బీబీజీ తిలక్ ఆధ్వర్యంలో ఒక స్కిట్ రూపొందించి ప్రదర్శించడం జరిగింది. స్క్రిప్ట్ అనేదే లేకుండా, డైలాగులు ముందే రాసుకోకుండా పాత్రధారులే అప్పటికప్పుడు సన్నివేశాన్ని మాటల్లో చెబుతూ రూపొందించిన ఈ స్కిట్ దాంట్లో నటించిన మాకే ఆశ్చర్యం కలిగించింది. అయిదే అయిదు పాత్రల (ఎన్టీఆర్, నాదెండ్ల ముఖ్యులు) కలయికతో తిరుపతిలో ఎస్వీ యూనివర్సిటీలో, ఇంజనీరింగ్ కాలేజీలో మాత్రమే కాకుండా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఈ పావుగంట స్కిట్ ప్రదర్శిస్తే జనం విరగబడి చూశారు. (గమ్మత్తేమిటంటే తిరుపతి బస్టాండులో మేమందరం వేసిన ఈ స్కిట్‌ను చూసిన వాళ్లలో దేవుడి దర్శనం కోసం వచ్చి తిరుగు ప్రయాణంలో ఉన్న మా ఊరి వాళ్లు కూడా ఉన్నారట. 'ఎంబా.. మీ వాడు రాడికల్స్‌లో చేరి బస్టాండులో నాటకం వేస్తున్నాడు' అని వాళ్లు ఊరికెళ్లి మా నాన్నకు చెప్పడం. తర్వాత ఊరికెళితే 'ఏరా తిరుపతికి పంపించింది నాటకాలు వేసుకోవడానికటరా' అంటూ నాన్న నన్ను దెప్పడం.. ఇదంతా మరో కథ).

చివరకు ఆరోజుల్లోనే దేశాన్ని సంస్కృతమయం చేయాలనే ఉద్యమాన్ని ప్రచారం చేస్తూ తిరుపతికి వచ్చిన కర్నాటక సంస్కృత విద్యాపీఠం విద్యార్థి ప్రతినిధులు కొందరు సంస్కృత సంభాషణలతోనే ఒక స్కిట్ వేసి తిరుపతిలో చాలా చోట్ల ప్రదర్శించారు. రాజకీయ నాయకుల అవినీతిని ఏకిపడేస్తూ సరళమైన సంస్కృత డైలాగులతో సాగిన ఆ స్కిట్ ముగింపు కడుపుబ్బా నవ్వించింది. 'సంస్కృతం మృతభాష కాదు జీవద్భాష, ప్రయత్నిస్తే ఎవరైనా సరళ సంస్కృతాన్ని నేర్చుకోవచ్చు' అనే ఉద్యమ ప్రచారంలో భాగంగా వారు దేశమంతా ఇలాంటి స్కిట్‌లను ప్రదర్శించారు. అదొక చరిత్ర.

మొన్ననే హైదరాబాద్‌లో 'మార్పుకోసం మంచి సినిమా' పేరిట 9 లఘుచిత్రాల ప్రదర్శన కార్యక్రమంలో ఆ చిత్రాల పరిచయ కర్తగా, వ్యాఖ్యాతగా వ్యవహరించిన థియేటర్ ఏక్టివిస్ట్ గౌరవ్, థియేటర్ రంగంలో సరికొత్త ప్రయోగానికి సంబంధించి ఒక మంచి కథనం పంపించారు. దిశ పత్రికకు పంపిన ఈ కథనంలో వినోద సాధనమైన సినిమా పేరుతో ప్రజలమీదికి వదులుతున్న రకరకాల సాంస్కృతిక వ్యర్థాల గురించి వివరిస్తూనే, ప్రత్యామ్నాయ పీడితుల రంగస్థలం గురించి సరికొత్త ప్రతిపాదన చేశారు. 'వ్యక్తిగత జీవితంలో ఏదో రకమైన ఆధిపత్యాన్ని ఆచరిస్తూ, ఎన్నిరకాల సమానతా సిద్ధాంతాలు చెప్పినా ప్రజలు వినరు. ఏ కాలంలోనైనా ప్రజలు మాత్రమే విస్తృత చైతన్యానికి ప్రతినిధులు. బహుజనులు మాత్రమే బలమైన ప్రత్యామ్నాయ శోధనకి చోదక శక్తులు' అని స్పష్టం చేస్తున్న గౌరవ్ బహుమతులు, పురస్కారాల కోసం మాత్రమే నాటకాలన్నంత దుస్థితి దాపురించిన మొత్తం క్రమంలో కొత్తతరాలకు అసలు నాటకం అంటేనే తెలీకుండా అయిపోగా, గతాన్ని పట్టుకు వేలాడే పెద్దతరంలో కొద్ది మందికి మాత్రమే పరిమితమైన జ్ఞాపకంగా తెలుగు నాటకం మిగిలి పోయింద'ని ఆవేదన వ్యక్తం చేశారు. వీక్షకులని మొట్టమొదటిసారిగా ప్రదర్శనలో భాగం చేసిన అపూర్వ ప్రయోగం 'పీడితుల రంగస్థలం' అంటూ బ్రెజిల్‌కి చెందిన ఆగస్టో బోల్ ప్రతిపాదించిన 'థియేటర్ ఆఫ్ ది అప్రెస్డ్' అనే నిత్యనూతన ప్రక్రియ గురించి ఆయన ఈ కథనంలో వివరించారు

నాటకం అంటే డైలాగులు, రసజ్ఞత, రచయితలు, ప్రేక్షకులు, రససిద్ధి.. ఇలాంటి ఆధిక్యత కలిగిన భావజాల చట్రం నుండి బయటపడి 'మనమంతా రంగస్థలం' (We all are Theatre) అనే ధోరణి ముందుగా ప్రగతిశీల సాంస్కృతిక సంస్థలకు కల్పించాలి. ప్రపంచంలో సుమారు 70 దేశాలు 'పీడితుల రంగ స్థలం' (థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్) విధానాన్ని అనేక రీతుల్లో అభివృద్ధి చేసి వాడుకుంటూ భిన్న ప్రత్యామ్నాయ క్షేత్రాల్ని సిద్ధం చేసుకున్న చరిత్ర మన కళ్ళ ముందే ఉంది అంటున్న గౌరవ్ కథనం పూర్తి పాఠాన్ని ఇక్కడ చదవండి. నిజంగానే ఇది నాటకరంగంలో కొత్త ప్రయోగం గురించి చెబుతున్న స్ఫూర్తిదాయకమైన కథనం.

– రాజశేఖర్ రాజు

దినపత్రికా ప్రతినిధి

పీడితుల రంగస్థలం... సగటు ప్రేక్షకుడికి దిక్సూచి

దీళిత బహుజన కళాతాత్విక సృజన..!
ఒక ప్రత్యామ్నాయ ప్రజాపక్ష అభివ్యక్తి
రూపకం దగ్గరే ఆగిపోయిన భారతీయ నాటక రంగం
పెద్దతరంలో కొద్దిమందికే పరిమితమైన జ్ఞాపకంగా తెలుగు నాటకం
సగటు ప్రేక్షకుడికి తిరుగులేని దిక్సూచి... థియేటర్ ఆఫ్ ది అప్రెస్డ్
వీక్షకులని తొలిసారిగా ప్రదర్శనలో భాగం చేసిన అపూర్వ ప్రయోగం
ప్రత్యామ్నాయ వేదికగా పీడితుల రంగస్థలం

భారతీయ నాటక రంగం రూపకం దగ్గరే ఆగిపోయింది. వాహకంగా మారి ప్రజల జీవితాల్లో భాగం కాలేకపోయింది. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఒకనాడు ఆబాలగోపాలాన్నీ అలరించిన ఈ ప్రక్రియ తేరుకోలేనంతగా మూగబోయింది. కళల్ని, అభిరుచుల్ని మానవ జీవన విధానాన్ని సుసంపన్నం చేసే సాధనంగా కాక, ఏదో కాలక్షేపం కోసం ఉద్దేశించిన వ్యర్థ కార్యక్రమాలుగా భావించే 'రాజకీయ' రంగానికి సంస్కృతి అంటే మొదట్నుంచీ చిన్నచూపు. అందుకే సామాన్య ప్రజల చైతన్యానికి చేయూత నిచ్చే నాటకం అంటే, వాళ్ళ నాటకాలు ఎక్కడ బయట పెడతాయో అనే భయం. దాన్నుండే అభద్రతా భావంతో కూడిన అంతర్గత ద్వేషం. లేకపోతే ప్రపంచంలోని అనేక దేశాలు పిల్లల విద్య మొదలుకొని పౌరసమాజం ఆరోగ్యం వరకూ సాంస్కృతిక రంగంలో విభిన్నమైన ప్రయోగాలు చేసి అమలు చేస్తూ ఉంటే, మనకి మాత్రం అసలు సంస్కృతి గురించిన చర్చే ఎన్నడూ జరగదు.

పురస్కారాల కోసం మాత్రమే నాటకాలు

ఆదివాసుల సంస్కృతిలో కళలు జీవితం నుండి పరాయీకరించబడి వేరుగా ఉండవు. వాళ్ళ దైనందిన బతుకుల్లో భాగంగానే ఏ కళనైనా సృజించుకుంటారు. మొదట్లో శ్రామిక జనాల పట్ల సహానుభూతితో వారి క్షేత్రస్థాయి సమస్యలకి ప్రతిబింబంగా వర్ధిల్లిన అభ్యుదయ నాటకం మెల్లమెల్లగా ఒక దశకొచ్చి ఆగిపోయింది. యావత్ ప్రపంచాన్ని వెల్లువెత్తి ముంచేసిన ప్రపంచీకరణ ప్రభావానికి ఆకావికలై బేలగా మిగిలిపోయింది. ఆ క్రమంలో, ఒకపక్క ప్రజాపక్ష బుద్దిజీవులు నాటకాలపై అధ్యయనం చేయకపోగా, మరో పక్క కార్పోరేట్ మీడియా నాటకాన్ని ద్వితీయ

శ్రేణి మాధ్యమంగా, చులకనగా, హేళనగా చూపించడం జరిగింది. నాటకాల కోసం బహుమతులనే సంస్కృతి పోయి, బహుమతులు, పురస్కారాల కోసం మాత్రమే నాటకాలన్నంత దుస్థితి దాపురించింది. ఈ మొత్తం క్రమంలో కొత్తతరాలకు అసలు నాటకం అంటేనే తెలీకుండా అయిపోగా, గతాన్ని పట్టుకు వేలాడే పెద్దతరంలో కొద్ది మందికి మాత్రమే పరిమితమైన జ్ఞాపకంగా తెలుగు నాటకం మిగిలి పోయింది.

వీక్షకులని భాగం చేసుకోగలిగేదే నిజమైన కళ

ఇలాంటప్పుడే వ్యవస్థల ఉన్నతిని సంపాదనలో మాత్రమే కొలుచుకునే యాంత్రికతకి విరుద్ధంగా, ప్రజల సంతోషానికి, ఆహ్లాదానికి కళలు అవసరమనే ఆలోచన అవసరం. బాల్యంలోనే నీతి కథలు, పొడుపు విరుపులు, సామెతలు నానుడుల్ని విరివిగా ఉపయోగించే ధారణకు నాటకం ఒక బలమైన ప్రోత్సాహం. అందుకే, రంగస్థలం సజీవ మాధ్యమం (Live Theatre). అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సినిమా మన కళ్ళ ముందు ఎన్ని అద్భుతాలైనా సృష్టించగలదు. కానీ, అదంతా మరొకరి 'అభిరుచి'ని ప్రేక్షకులపై రుద్దేదే కానీ వీక్షకులని భాగం చేసుకోగలిగేది కాదు, కాబోదు. ఇందుకు విరుద్ధంగా బ్రెజిల్‌కి చెందిన ఆగస్టో బోల్ ప్రతిపాదించిన థియేటర్ ఆఫ్ ది అప్రెస్డ్ (Theatre of the Oppressed) ఒక నిత్య నూతన ప్రక్రియ. వీక్షకులని మొట్టమొదటిసారిగా ప్రదర్శనలో భాగం చేసిన అపూర్వ ప్రయోగం. సాంప్రదాయిక నాటకానికి, సాంకేతిక సినిమాకి మధ్యస్థంగా మిగిలిపోయిన సగటు భారతీయ ప్రేక్షకుడికి తిరుగులేని దిక్సూచి ఈ థియేటర్ .

'మనమంతా రంగస్థలం' ... అదే 'పీడితుల రంగస్థలం'

ఆధిపత్య సమాజంలో అనేక సమూహాల అస్తిత్వాన్ని గుర్తించడమే నవీన కళాభివ్యక్తి పురోగతి. ఐతే, తెలుగులో అది కేవలం వివిధ రకాల వామపక్ష పార్టీల సమావేశాలప్పుడు వచ్చిన కార్యకర్తలు వెళ్ళిపోకుండా ఉండటం కోసం వార్ని కూర్చోబెట్టేందుకు పాటలు పాడే కొద్దిపాటి కళాబృందాలుగానే మిగిలిపోవడం గొప్ప దౌర్భాగ్యం. అందుకు వ్యతిరేకంగా కళని ఒక ప్రజా ఉద్యమ వాహకంగా, సమర్థవంతమైన పనిముట్టగా ప్రవేశ పెట్టడం జరగాలి. నాటకం అంటే డైలాగులు, రసజ్ఞత, రచయితలు, ప్రేక్షకులు, రససిద్ధి.. .ఇలాంటి ఆధిక్యత కలిగిన భావజాల చట్రం నుండి బయటపడి 'మనమంతా రంగస్థలం' (We all are Theatre) అనే ధోరణి ముందు ప్రగతిశీల సాంస్కృతిక సంస్థలకు కల్పించాలి. ప్రపంచంలో

సుమారు 70 దేశాలు 'పీడితుల రంగ స్థలం' (థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్) విధానాన్ని అనేక రీతుల్లో అభివృద్ధి చేసి వాడుకుంటూ భిన్న ప్రత్యామ్నాయ క్షేత్రాల్ని సిద్ధం చేసుకున్న చరిత్ర మన కళ్ళ ముందే ఉంది. భారతదేశంలో కూడా దాదాపు 10 కి పైబడిన రాష్ట్రాలలో ఈ ప్రక్రియను ప్రచారం చేస్తున్నారు. కాగా, ఎంతో దార్శనికత వెల్లిబుచ్చే తెలుగు సాంస్కృతిక రంగంలో మాత్రం ఈ దిశగా ఇప్పటికీ ఒక్కటంటే ఒక్క ప్రయత్నం జరగకపోవడం మన సాంస్కృతిక వెనుకబాటుతనానికి ప్రతీక.

వీక్షకులే నటులైతే...

నిత్య జీవితంలో ఆధిపత్యాన్ని గుర్తింప జేయటం ఈ పీడితుల రంగస్థలం ప్రత్యేకత. కులం, మతం, జండర్, భాష, సమూహం, సంస్కృతి.. ఇలా అన్ని క్షేత్రాల్లో ఈసరికే గూడు కట్టుకున్న తిరోగమన భావాల్ని శరీరం, మనసు ఉప యోగించి చేసే ఆటలతో, వ్యాయామంతో పటాపంచలు చేయడం ప్రత్యామ్నాయ రంగస్థలం బలం. నటులకీ ,ప్రేక్షకులకీ మధ్య ఉన్న తెరని తొలగించి వీక్షకుల్ని కూడా నటులుగా 'spectactors' భాగస్వామ్యం చేసుకునే విశిష్టమైన కృషి థియేటర్ ఆఫ్ ది అప్రస్డ్. మనకి తెలీకుండానే, మన ప్రమేయం లేకుండానే మనం నిర్వహించే ఆధిపత్య 'పాత్ర'ను మనచేత గుర్తింపజేసి, దాని నుండి బయట పడడానికి ఉన్న అవకాశాల్ని మన ముందు ఆరోగ్యకరమైన చర్చగా ప్రవేశపెట్టడం ఈ థియేటర్ బలం. ప్రజలంతా ఒక్కటేననీ, వీరిలో ప్రత్యేకంగా 'నిపుణత కలిగిన నటులు' ఎవరూ ఉండరనీ, ఎవ్వరైనా జీవితం లోని అణిచివేతనీ, తద్వారా తలెత్తిన చేదు అనుభవాలకి ఒక సమూహంగా రూపం ఇచ్చే ప్రయత్నం చేస్తే అది అందరికీ అర్థమవుతుందని ప్రత్యామ్నాయ ప్రజా రంగస్థలం భావిస్తుంది. ఆ దిశగానే పని చేస్తుంది కూడా.

వినోదం పేరిట ఆకట్టుకుంటున్న సాంస్కృతిక వ్యర్థాలు

ఇదంతా ఎందుకు? ఆధిపత్య వ్యవస్థలో ఎవరికివారు నిత్యం మానవీయ సున్నితత్వాన్ని ఏర్పర్చుకోవడం ఒక నిత్య వ్యాయామం కావాలి. అమానుషత్వాన్ని స్వచ్ఛందంగా విడనాడి మళ్ళీ మానవీకరించబడాలి (Re-humanize). ఈ ప్రక్రియలో ఎవరూ ఎవరికీ గురుశిష్యులు కారు. ఇందులో మార్గదర్శకాలు (Guide-lines) తప్ప నియమాలు (Rules) ఉండవు. ఆటపాటల్లో కూడా గెలుపోటములు ఉండవు. అసలు ఆ రకమైన భాషని ఉపయోగించడమే కనిపించదు. వృత్తి, ప్రవృత్తులతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఎవరైనా ఇందులో భాగం కావచ్చు.

ఆసక్తి, అభిరుచి ఉంటే చాలు. రంగు, రూపు, భాష, భావం, ఎత్తు, పొడుగు ఇవన్నీ అర్థరహితమని ప్రత్యామ్నాయ రంగస్థలం భావిస్తుంది. నిబద్ధత కలిగిన వ్యక్తీకరణ నిజాన్ని మాత్రమే చూపిస్తుంది, నిజాయితీగా మాత్రమే వ్యవహరిస్తుంది. అలా కాకపోతే ఫలానా బృందానికి ఫలానా నాటకం మాత్రమే సరైందనే భావన నెలకొంటుంది. ముఖ్యంగా, పీడిత వర్గాలైన బహుజనులకి, మహిళలకి, ఇతర జండర్లకీ జీవితాన్ని అప్రయోజన దృష్టితో చూసే వెకిలి మాధ్యమంగా, సంపాదన, కీర్తిప్రతిష్ఠల కోసం పాకులాడే చట్రంగానే 'నటన'ని పరిచయం చేస్తుంది. వయసుతో సంబంధం లేకుండా వారందరినీ ఆ మృత సంస్కృతికి బానిసల్ని చేస్తుంది. ఈరోజు మొబైల్ మొదలుకొని సామాజిక మాధ్యమాల వరకూ పిల్లల్ని, మహిళల్ని 'వినోదం ' పేరిట ఆకట్టుకునేలా చేసే సాంస్కృతిక వ్యర్థాలు అవే.

ఆధిపత్యాన్ని ఆచరిస్తున్న సమానతా సిద్ధాంతాలు

ఇందుకు విరుద్ధంగా ఒక ప్రజాపక్ష భావజాల స్రవంతిని నిర్మించే బాధ్యతను సాంస్కృతిక రంగం స్వీకరించాలి. నూతన తరహా ప్రచార కార్యక్రమాన్ని నిర్మించుకోగలగాలి. కాలం చెల్లిన వ్యూహాల్ని పక్కన పెట్టి అనేక ప్రాంతాల్లో ఉన్న ప్రత్యామ్నాయ ప్రజాపక్ష కళా తాత్విక చింతనల్ని లోతుగా అధ్యయనం చేయాలి. భావజాలం నిర్మించడం పదజాలాన్ని వల్లించినంత సులువు కాదు. కాబట్టి, ముఖ్యంగా, విద్యార్థులు, యువత సమాజ హిత కార్యాచరణలో భాగం అయ్యేలా చూసుకోవాలి. వ్యక్తిగత జీవితంలో ఏదో రకమైన ఆధిపత్యాన్ని ఆచరిస్తూ, ఎన్నిరకాల సమానతా సిద్ధాంతాలు చెప్పినా ప్రజలు వినరు. ఏ కాలంలోనైనా ప్రజలు మాత్రమే విస్తృత చైతన్యానికి ప్రతినిధులు. బహుజనులు మాత్రమే బలమైన ప్రత్యామ్నాయ శోధనకి చోదక శక్తులు. కనుక, స్వీయలోపాల సవరణకి నిజాయితీగా సిద్ధపడకపోతే సాంస్కృతికంగా మరింత క్షీణదశకు చేరతామనడంలో సందేహం లేదు. అలా కాకుండా ఉండటానికి ఇప్పటికీ ప్రగతిశీల అభ్యుదయ శక్తుల ముందు ఉన్న మార్గం ఈ ప్రత్యామ్నాయ పీడితుల రంగస్థలం.

(దిశ పత్రికలో ప్రచురితం)

తెలుగు నాటకం మూలాలు ...!

"జీవితం అంటే మహావృక్షాల అరణ్యమన్నాడు ఒకడు. అక్కడ మహావృక్షాలే కాదు చిన్ని మొక్కలు , సన్నతీగలు కూడా వుంటాయి, కళ్ళు పెట్టుకుని చూడమంటాడు యింకొకడు. జీవితం లోనే కాదు సాహిత్యం లోనూ అంతే. ఆర్ధర్ మిల్లర్ రెండు రకాల రచయితల్ని చెప్పాడు. ఒకరకం రచయిత ప్రపంచానికి దూరంగా ఉండి రచనలు చేసేవాడు. వీడు ఉన్నత తరగతి జీవితం వర్ణిస్తాడు. ఒకడు సమాజం నట్టనడుమ తన గుడారాల్ని కట్టుకొని జీవించేవాడు. వాడు పేద, మధ్యతరగతి జీవితం రాస్తాడు. ఆర్ధర్ మిల్లర్ అనుభవంలోకి ఇండియా లోని మూడో రచయిత రాలేదు. ఈ దేశంలో మూడో రచయిత ఉన్నాడు. వాడు సమాజం తన గుడారాన్ని నట్టనడుమ కట్టుకోడానికి వీలు లేకుండా చేసినప్పుడు ఊరికి దూరంగా ఉన్న తన గుడారంలో సాహిత్యాన్ని అల్లుకున్నవాడు. వర్గసమాజం ఇచ్చిన విభజనలో పేద వర్గానికి చెందిన వాడు. వర్ణవ్యవస్థ ఇచ్చిన కులచట్రంలో అట్టడుగు కులానికి చెందిన వాడు." (పేజి – 1)



చూడటానికి ఇష్టపడని తెలుగు నాటక మూలాలు పేరిట 'తెలుగు నాటకం మూలాలు...' పుస్తకంలో కళ్యాణరావు మొదటి పేజిలోనే సాంప్రదాయక మూస పద్ధతిలో సాగుతున్న విశ్లేషణ ఒరవడికి విరుద్ధంగా తానెవరి పక్షమో స్పష్టం చేసిన ఒక ధిక్కార స్వరం ప్రజాపక్షాన ఈ అక్షరాల్లోంచి వినబడుతుంది. కళల్ని, నాటకాల్ని ఒక రకంగా మాత్రమే చూడటానికి అలవాటు పడ్డ వామపక్ష రాజకీయ బుద్దిజీవుల్ని కూడా ఇంతటి లోతు కలవర పెడుతుంది. ఎందుకంటే,

"ఈ దేశంలో వర్గంతో పాటు కులం కూడా ఉంది. కులానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ వర్గ సమాజం అభివృద్ధి చెందింది. అక్కడ కులం ఉంది.

రాజ్యం ఆవిర్భవించింది. అక్కడ కులం ఉంది. మహమద్ దండయాత్రలు, మొగలాయి సామ్రాజ్యాలు వచ్చాయి. అక్కడ కులం ఉంది. ఈస్టిండియా కంపెనీ వచ్చింది. బ్రిటీష్ పాలన దీర్ఘకాలం ఉంది. అక్కడ కులం ఉంది. సోకాల్డు స్వరాజ్యం వచ్చింది. సంక్షేమ రాజ్యం అంటో నడుస్తోంది. కులం చాలా పదిలంగా ఉంది. ఈ దేశంలో ఆటకు వర్గం ఉంది, కులం ఉంది. పాటకు వర్గం ఉంది, కులం ఉంది. మాటకూ అంతే అవి రెండూ వున్నాయి. కులం ఏదైనా కావచ్చు. ప్రాంతం ఏదైనా కావచ్చు. ఈ దేశంలో కళని కులం తక్కెట్లోనే తూచి ఖరీదు కట్టారు. ఈ మాటలు కొందరికి పచ్చిగా వుండొచ్చు. నిజాలు ఎప్పుడూ అట్లాగే ఉంటాయి. పచ్చిగా ఉంటాయి. పరమ దుర్మార్గంగా ఉంటాయి." (పేజి – 32)

ముప్పై మూడు పుటల చిన్న పుస్తకం. ముప్పై మూడు పళ్ళూ రాలగొట్టే ప్రశ్నల్నిలా వేస్తే తట్టుకోలేక పోతుంది చరిత్ర. ఎందుకంటే అది కొందరి పక్షమే. అందరిదీ కాదు. అలా కాకుండా చేయడానికే ఈ దేశంలో కొన్ని వ్యవస్థలు ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. ఇప్పటికీ రూపొందించబడుతున్నాయ్. ఎలాగంటారా?

"విచిత్రమేమిటంటే ఈ దేశం అట్టడుగు వర్గం వాడు, ప్రత్యేకించి దళితుడు తన కోసం తన పూర్వీకుల కోసం చరిత్రని వెతికితే ఎన్ని పేజీలు దొరుకుతాయ్. పట్టుమని పది పేజీలు కూడా దొరకవు. దొరికినా అక్కడ అతను ఉండడు. అతని పూర్వికులు ఉండరు. వాళ్ళదంతా వినికిడి జ్ఞానం. వినికిడి సాంప్రదాయం. అల్లిక వారసత్వం. ఆ వినికిడి, ఆ అల్లిక చరిత్రలో సాహిత్యంలో అతని శరీరంలాగే అంట రానిదై పోయింది. అది కళ కావచ్చు. సంస్కృతి కావచ్చు. ఏదైనా కావచ్చు. తొక్కివేయ బడింది. I belong to Netting Heritage". నాది "అల్లిక వారసత్వం". Netting Heritage అనే పదం ఆంగ్ల నిఘంటువుల్లో దొరక్క పోవచ్చు. అల్లిక వారసత్వం అనే పదం తెలుగు నిఘంటువుల్లోనూ దొరక్క పోవచ్చు. దొరక్కపోతే ఆ పదాల్ని కలపాల్సి ఉంది. వాటి మూలాల్ని వెతకాల్సి ఉంది. ఆఫ్రికన్ సాహిత్యంలో గూగీ తన పూర్వీకులు వాడిన పదాల కోసం చేసిన అన్వేషణ యిక్కడా జరగాల్సి ఉంది. అప్పుడు అర్థమౌతుంది అల్లిక వారసత్వం ఎంత అద్భుతమైందో." (పేజీ– 22)

నిజమే, ఎంత అద్భుతమైనవి ప్రజాకళలు. ఎంత నిండైనవి జానపదాలు. ఈ రోజు ఎక్కడ వెతుక్కోవాలి ? ఎవరు వెతుక్కోవాలి ? మతం, రాజ్యం జమిలి గా

కబ్జా చేసిన కళల్ని ఈరోజు మనం స్వచ్ఛంగా ఎలా అనుభూతి చెందాలి ? అసలు అవి ఉన్నదెక్కడ..?

"సామాన్య వర్గాల్లో జానపద సంప్రదాయం ఉంది. దేవాలయం బయటి కళ ఉంది. నిండైన జీవితం ఉంది. అట్టా వుండి అది సామాజికంగా ఉంది. మొత్తం కలిసి ఒక సామాజిక కళ, వాస్తవిక విలువ, జీవితమంత అద్భుతమైన రంగస్థలం సామాన్యుల మధ్య ఉంది. కళలు అలా వొదిగివొదిగి అమ్మమ్మ ఒడిలో దాక్కొని అద్భుతమైన కథలు వినే అందాల మనవరాలిలా ప్రజల గుండెల్లో గూడు కట్టుకుని ఉన్నాయి. నాటకం కూడా అంతే. అది వాళ్ళ జీవితాల్లో మిగిలి ఉంది. అట్టా ఉందని తెలుసుకోకపోవడం మన తప్పవుతుంది. అది నాటకం తప్పు మాత్రం కాదు." (పేజీ – 2)

ఇక్కడే కళని ఎలా చూడాలనే ప్రశ్న కూడా వస్తుంది. ఆస్కార్ వైల్డ్ దగ్గర్నుంచీ ఆధునిక నాటక విమర్శకుల వరకూ, కందుకూరి వీరేశలింగం నుంచి గురజాడ అప్పారావు వరకూ తెలుగు సారస్వత చరిత్ర మీద రచయిత జి. కళ్యాణరావు పెట్టిన ప్రశ్నలు అన్నీ కూడా అర్థవంతమైన దుఃఖం తాలూకు భావోద్వేగాలే . అందుకే, "కళలు ఆరాధించే విగ్రహాలు కాదు. కళారాధన, కళోద్ధరణ, కళా తపస్సు యివన్నీ విశ్రాంతి వర్గ మేధావుల, పండితుల మేధస్సులోంచి పుట్టుకొచ్చిన పదాలు. ఈ పదాలకు కళకు ఎలాంటి సంబంధం లేదు. సామాన్య జనానికి కళ ఒక ఆరాధన కాదు. వాళ్ళెప్పుడూ కళను ఉద్ధరిస్తున్నట్లు భ్రమపడరు. భ్రమ ఎప్పుడూ సహజత్వానికి దూరంగా ఉంటుంది. జానపదుడి గానానికి, పండితుడి సంగీతానికి తేడా వుంది. కళ తనకి తాను ఓ ప్రత్యేక జ్ఞాపకం అని అనుకోదు. ప్రత్యేక అనుభూతి అనుకోదు. నిజానికి తానో ప్రత్యేక రూపం అని కూడా అనుకోదు. మనిషి ఎంత సహజమైన సంఘజీవో కళ కూడా సమాజానికి చాలా సహజమైన జ్ఞాపకం, అనుభవం, అనుభూతి, రూపం, సారం." (పేజీ – 17) ఇంతటి సహజమైన కళా ప్రక్రియల నేపథ్యం ప్రజా జీవన తాత్వికత అధ్యయనం చేసిన వారికే సాధ్యం. అందుకే,

"ప్రజలకు తిండి కావాలి. గుడ్డ కావాలి. ఇంత నీడ కావాలి. వీటితోపాటు కళ కూడా కావాలి. తిండి, గుడ్డ, నీడ, పని, కళ యివన్నీ చాలా సహజమైన

అవసరాలు. ఈ మాట ఇంత సాదాగా, చాలా మామూలుగా అంటే శిష్టులు గుండెలు బాదుకొంటారు. ఎందుకంటే కళకీ, సాహిత్యానికీ వీళ్ళు చాలా నిబంధనలు పెట్టారు. ప్రమాణాలు పెట్టారు. విమర్శకు కూడా అంతే. ఎన్ని కొలబద్దలో ! ఆ కొలబద్ద లతోనే సాహితీ విమర్శని ఓ అందని పండుని చేసారు. నిజానికి సాహితీ విమర్శ అనేది సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. అర్థమయ్యేదిగా ఉండాలి. అప్పుడే సాహిత్యం బాగుపడేది. “ (పేజీ – 19)

“తెలుగు సాహిత్యంలో పితామహులు, మాతామహులు, యుగకర్తలు, మహాకవులు అంతా పండిత వర్గాల నుంచే సృష్టించ బడ్డారన్న” (పేజీ 13) ఆయన, అందుకే,” నిజం మాట్లాడితే నిష్టూరంగా వుంటుందేమో గానీ తెలుగు నేల మీద దళితులు జ్యోతిరావు ఫూలే ‘తృతీయరత్న’ లో తమ బతుకు వెతుక్కోగలరేమో కానీ , ఈ నేల మీద పుట్టిన ఎంత గొప్ప కళాఖండమైనా ‘కన్యాశుల్కం’ లో తమని వెతుక్కోలేరు. నా మటుకు నాకు గురజాడ కన్నా ఫూలే దగ్గరివాడు.” అని కచ్చితంగా చెప్పగలిగాడు. చెప్తూనే, “అయితే, బుచ్చమ్మ లాంటి బిడ్డల బతుకు ప్రపంచం ముందు వుంచినందుకు, మధురవాణి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దినందుకూ గురజాడను అభినందించకుండా వుండలేను” అంటారు. (పేజీ 13)

“నిజానికి తెలుగు నేల మీద ఎంతమంది అంటరాని హోమర్లు ఎంత అద్భుతమైన ఒడిస్సీలు, యిలియడ్లు గానం చేసారో ! అని అనుకున్నప్పుడు అదోలా ఉంటుంది. ఆ మూలం తాకడానికి నిజంగా ఎంత వెతుకులాట మొదలు కావాలి. ఈ వెతుకులాట జరక్కపోతే చరిత్రతో తెగతెంపులు చేసుకోవడమౌతుంది. ఒక సహజమైన వారసత్వానికి తిలోదకాలు ఇవ్వడమౌతుంది ..తొలి తెలుగు నాటకాన్ని నిరక్షరాస్యులే నిర్మించుకున్నారు. అదో అద్భుతమైన జ్ఞాపకశక్తి. యిది ఒక్క తెలుగు నేల మీదే కాదు ప్రపంచ వ్యాపితంగా జరిగింది. కాలం, జ్ఞానం, అనుభవం కలగలిపిన అల్లిక అది...” (పేజీ – 23)

అలాంటి అల్లిక పై రాత కుట్రలా జరిగిందో చెప్పే నాలుగు వాక్యాల తోనే ఈ పుస్తకం ప్రారంభమై చివర్లో వాటితోనే ముగుస్తుంది. కాన దాంతోనే నేనూ ముగిస్తాను. అర్థం చేసుకోవాలే కానీ ఆ అక్షరాల్లో శతాబ్దాల ఘోష ఉంది. ఆవేదన ఉంది. ఆక్రందన ఉంది. అది,

"మా అయ్య అల్లిందాన్నే
వాడయ్య రాసేడు
అల్లిక అంటరానిదైంది
రాతేమో రాజై కూసుంది"

(ప్రజా కళామండలి రాష్ట్ర మహాసభల సందర్భంగా జి. కళ్యాణరావు చేసిన అద్భుతమైన ప్రసంగ పాఠాన్ని సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం 2002 లో 'తెలుగు నాటకం మూలాలు..' పేరిట చిన్న పుస్తకంగా విరసం ప్రచురించింది. నన్నెంతగానో ప్రభావితం చేసిన ఇరవై ఏళ్ళ 'అంటరాని వసంతాన్ని' గుర్తు చేసినట్లే దీన్ని కూడా గుర్తు చేసుకోవడం ఆలోచనా పరులందరి బాధ్యతనేది నా భావన. అందుకే కామ్రేడ్ దివాకర్కి ప్రేమతో అంకితం ఇవ్వబడ్డ ఈ చిన్ని పుస్తకం ఈ రోజు మరింత అవసరమనీ , ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి ని, కళల్నీ అధ్యయనం చేయడానికి ప్రధాన సాధనంగా ఉంటుందనే నా అభిప్రాయం ఇలా తెలియజేస్తూ ఈ బుక్‌లెట్ ఇప్పుడు అందుబాటులో ఉందో లేదో తెలియదు కానీ లేకపోతే కనుక కచ్చితంగా పునర్ముద్రణ చేసే విధంగా ఔత్సాహికులు ప్రయత్నం చేయాలనే నా ఆకాంక్ష ను ఇరవై ఏళ్ళ ఈ ప్రసంగ ప్రచురణనిలా రైటప్ రూపంలో పరిచయం చేయడం ద్వారా తెలుపుతూ ఇక్కడికి ఆగుతాను.)

(FB లో రాసిన సమీక్షా వ్యాసం)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆదివాసీలకి రంగస్థల శిక్షణ.

సమానత కోసం ఒక సృజనశీల ప్రయోగం



శక్తివంతమైన వ్యక్తీకరణ సరైన ధిక్కారం!
ప్రశ్నించడమే ప్రత్యామ్నాయానికి ప్రతీక!
కొత్తపద్ధతిలో సాంస్కృతిక వికాసవీచిక !
మహిళా చైతన్య ప్రవాహశీల ప్రవంతి!

It's very difficult to describe and explain Theatre of the Oppressed in words. Perhaps, the best way to understand this form of theatre is to perform it. ***-Gopal Midha TO, A Manual for educators***

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాతా సావిత్రిబాయి ఫూలే వర్ధంతిని పురస్కరించుకుని డా . అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురంలో తలపెట్టిన వర్క్ షాప్ (కార్యశాల) Theatre of the Oppressed. ఎంతప్రయోగాత్మక ప్రయత్నం ఐనా మొత్తం మహిళలతో చేస్తోంది కాబట్టి కొద్దిగా ఏ కోసానో కొంత బేరుకూ, కొన్ని అనుమానాలు ఉన్నాయి !

స్వేచ్ఛ! సమానత్వం!! సౌభ్రాతృత్వం!!!
మహిళా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమం
Womens Day Interactive Workshop
ప్రత్యామ్నాయ రంగస్థలం పరిచయం
Theatre of the Oppressed
మార్చి 9, 2025, ఆదివారం, రామచంద్రపురం
డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆం.ప్ర.


మహిళా దినోత్సవ చైతన్య స్రవంతి
Interactive Workshop for Women
ప్రత్యామ్నాయ రంగస్థలం పరిచయం
Theatre of the Oppressed
మార్చి 9, ఆదివారం, రామచంద్రపురం
డా. చెలికాని రామారావు భవన్
డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

ఉదయం నుండి సాయంత్రం వరకు పాల్గొన్న వారి ఉత్సాహాన్ని, ఆసక్తిని చూసాక వాళ్ళకి ఏమో కానీ నాకు మాత్రం చాలా నేర్చుకున్న భావన కలిగింది. లేకపోతే ఉదయం పదకొండుగంటలకి ప్రారంభించిన కార్యక్రమంలో అసలేమాత్రం పరిచయం లేని మహిళలు, ఏకంగా నాలుగైదు పూర్తి స్థాయి నాటకాలు వేయడం ఆశ్చర్యం కాక మరేమిటి !?

వరకట్నం, పురుషాధిక్యత, విద్య, వివాహం, కట్టుబాట్లు, మతం, సమాజం, రాజకీయం, మహిళల దుస్తులు, హావభావాలు, రుతుక్రమం,కుటుంబంలో స్త్రీలసమస్యలు ..ఎన్నని చర్చించారు. ఇంకెన్నింటికి పరిష్కారాలు ఆలోచించారు. ఒంటరి వంటిల్లుని ధ్వంసం చేద్దామనే విమల గారి కవిత పై చర్చించడం మొదలు గొంతెత్తి పాటలు పాడుతూ కూడా ఎన్ని సమస్యలు లేవనెత్తారు ! ?

రాజ్యాంగ ప్రవేశిక సమిష్టి పఠనంతో చేసిన కార్యక్రమం ప్రారంభం, సాయంత్రం ఆరవుతుండగా అందరూ వారి వారి భావాల్ని పంచుకోడంతో ముగిసింది. పురుషాధిక్యతతో నిండిన సమావేశాల్లో మొదటిసారిగా “శానిటరీ పేడ్స్ “అని స్పష్టంగా రాసి ఒక డబ్బాలో పెట్టి పాల్గొన్న వారికి అందుబాటులో ఉండేలా చూడటం మాకు ఆలస్యంగా కలిగిన కొద్దిపాటి జ్ఞానోదయంలో భాగం!

స్వేచ్ఛ,సమానత్వం,సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం మొదలైన రాజ్యాంగ విలువల వెలుగులో జరిగిన ఈ కార్యక్రమం సోకాల్డ్ నాటకరంగ ప్రముఖులు,నిపుణులకు అందనంత ఎత్తుకు పయనించింది. సాంస్కృతిక వికాసానికి కొత్త నిర్వచనం చెబుతూ నాలుగైదు గంటల్లోనే ఎన్నెన్నో అద్భుతమైన ఆశ్చర్యకర ప్రయోగాల్ని కళ్ళ ముందు నిలిపింది !

పీరియడ్స్ కారణంగా సగం మార్గం నుండి వెనుదిరిగి వెళ్లిపోయిన మిత్రురాలు సాక్షిగా సమావేశాల్ని, కార్యక్రమాల్ని కాస్త జెండర్ సెన్సిటివిటీతో నిర్వహించుకోవడం

అవసరం. “మీ సమావేశాల్లో, కార్యక్రమాల్లో మహిళల కోసం pads ఎందుకు పెట్టరు?” అని సహచరి కళ్యాణి అడిగే వరకూ వ్యక్తిగతంగా నాకూ ఆ ఆలోచన రాలేదు!

నిజంగానే ఎంత అజ్ఞానంలో ఉంటామో కదా.కార్యక్రమం అనగానే మంచినీళ్ళు, భోజనాలు, కుర్చీలు, బల్లలు, టీ టిఫిన్లు, జనాలు, అందులోభాగంగా మన కార్యక్రమం “విజయవంతం” అవడం కోసం, ఖాళీ కుర్చీలు “నిండుగా” ఉండటం కోసం మాత్రమే “మహిళలు” .ఇన్నాళ్లుగా వాళ్ళకంటూ ప్రత్యేక ప్రాకృతిక అవసరాలు ఉంటాయనీ, ఎలాంటి సమయంలోనూ అవి అందుబాటులో ఉంచడం అవసరమనే కనీస అవగాహన ఇన్నేళ్ళుగా ఎందుకు కలగలేదో !

ఈసారి నుండి ఏ మేజర్ కార్యక్రమం ఐనా ఇప్పటిదాకా జరిగిన ఈ పొరపాటును కాస్త సరిచేసుకోవాలి. నాకు తెలిసీ ఏ అభ్యుదయ ప్రజాసంఘము కూడా ఏ సమావేశంలోనూ sanitary Pads ను పెట్టలేదు. సరే, ఇదేదో చాలా పెద్ద మార్పు అనను కానీ ఈ కార్యక్రమంతో ఆ పని మేము చేస్తున్నామని, ఇక మీదట చేస్తామని చెప్పడమే నా ఉద్దేశం !

అసలీ కార్యక్రమానికి ‘ కుర్చీలు ‘ వొద్దనుకుని plan చేయడమే ఒక వింత. నాకు తెలిసీ ఆ హాల్ చరిత్రలో ఇలా ప్రత్యామ్నాయ పద్ధతిలో జరిగిన మొదటి workshop ఇదేనేమో. ఇంకా ఆసక్తి ఉన్నప్పటికీ అనుకోకుండా

పాలుగోవాల్సిన మహిళలకి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. శారీరక, మానసిక ఒత్తిళ్లు బాధ పెట్టాయి. వాళ్ళందరికీ నిజాయితీగా మా క్షమాపణలు !

ఉదయాన్నే ఇంటి దగ్గర వంటావార్పు చేసి మరీ ఏదో చెబుతామని వచ్చినవారికీ, ఇంటి దగ్గర పసిబాబు ఆపకుండా గుక్క పెట్టి ఏడుస్తుంటే కార్యక్రమం మధ్యలో ఇంటికెళ్ళి సముదాయించి తిరిగొచ్చిన తల్లి తపనకీ ఏమని కృతజ్ఞతలు చెప్పను. గుండె లోతుల్లోంచి తలొంచి నమస్కరించడం తప్పా. ఇలాంటి ఎన్నో విలువైన అనుభవాల వెల్లువగా నిలిచిన కార్యక్రమానికి సంభందించి చాలా సంక్షిప్తంగా ఈ చిన్న రైటప్ !

(కార్యక్రమం జరగడానికి కారణం అయిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇదేదో సాధారణ సమావేశాల తంతు కాదు. మొదలుపెట్టిన దగ్గర్నుంచి కత్తి మీద సామే. అలాంటి నిర్మాణాత్మక మైన ఈ కార్యాచరణలో భాగంగా, నాకు తెలిసీ తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి మహిళల కోసం నిర్వహించిన ఈ ప్రత్యామ్నాయ రంగస్థలం గురించిన కార్యశాలలో భాగమైన ప్రతి ఒక్కరికీ అభినందనలు . , Thank you One And All !) (FB లో రాసిన రైటప్)


స్నేహ!
సమానత్వం!!
సాహిత్యత్వం!!!
"While some people make theatre, We all are theatre."
~ Aayushi Bedi
మహిళా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమం
Women's Day Interactive Workshop
ప్రత్యామ్నాయ రంగస్థలం పరిచయం
Theatre of the Oppressed
తేదీ: 09-03-2025 ఆదివారం, డా॥ చెరికాని రామారావు గారి భవనం నందు
రామచంద్రపురం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.ఆంధ్రప్రదేశ్

చివరిమాట
తెలుగు నాటకం - వెలుగు నీడలు.

'Theatre Art is a universal expression of mankind and possess the influence and power to unite large groups of the world 's people in the service of peace. - UNESCO

"నాటకం జీవన దర్పణం, జాగృత స్వప్నం, ప్రజల పోరాట ఆయుధం."

మనిషి ఎలాగైనా బతకొచ్చు. కానీ మనిషిలా జీవించడానికి మాత్రం ఒక దృక్పథం కావాలి. రసజ్ఞతనూ, సౌందర్యాన్ని దర్శించే దృక్కోణం ఉండాలి. ప్రకృతినీ, మానవాళినీ మనసుతో ప్రేమించగలగాలి. ఉన్నంతలో ఉన్నతంగా ఎదగడానికి నిజాయితీగా ప్రయత్నించాలి. అలాంటి విశిష్టమైన జీవన విధానం కోసం 'కళల్ని' ఆశ్రయించాలి. అలాంటి సకల కళా సమాహారం 'నాటకం'.

నాటకం నవరసాల్ని శ్రావ్యంగా పలికిస్తుంది. నవనవోన్మేష ఆకాంక్షలకు అద్దంపడుతుంది. అనేకానేక వేదనామయ బాధల్ని కళ్లకు కడుతుంది. ఇంకెన్నో ఆశ్చర్యకర జీవన రాగాలని సుతారంగా వొలికిస్తుంది. మన కళ్ళ ముందే తనదైన అద్భుతాలను సృష్టిస్తుంది. బతుకుబాటలో అలసిపోయిన సగటు మనిషి భుజం తట్టి భరోసానిస్తుంది. మానవీయ ప్రస్థానాన్ని కళాత్మకంగా ప్రోత్సహిస్తుంది.

తెలుగు నాటకం చరిత్ర సైతం ఈనాటిది కాదు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య కూడా నిరంతరం పడుతూ లేస్తూ పయనిస్తోంది. పరిమితుల్లోనే అయినా, పలు అంశాలపై ప్రయోగాలు చేస్తోంది.అయినప్పటికీ, కళని జీవితంలో ప్రధాన భాగం చేసుకోవడం ఒక సంస్కృతిగా మారాలి. సకల మానవ సంఘర్షణల్ని కళలు సృజనాత్మకంగా ప్రతిబింబించాలి. జీవితం రసాస్వాదనలో పరిపూర్ణమై సార్థకం కావాలి.

సాహిత్యాన్ని చదివి ఆనందించాలి. కవిత్వాన్ని, పాటల్ని వింటూ ప్రేమించాలి. నృత్యాన్ని దర్శిస్తూ తరించాలి. చిత్ర లేఖనాన్ని చూస్తూ సంతోషించాలి. ఇలా ఎన్నో కళలు. మరెన్నో కథలు. అలాంటి అన్ని రకాల కళాభిరుచుల్ని ఒక్కదరికి చేర్చడమే

నాటకం. మానవ చరిత్రలో నాటకం అతి ప్రాచీన కళారూపం. అలాంటి అద్వితీయమైన రంగస్థలం కాలక్రమంలో ఎన్నో మార్పులకు లోనై ఈరోజు స్తబ్దతగా ఉంది.

అందుకు ఎన్నో కారణాలు ఉండవచ్చు. మరెన్నో విశ్లేషణల్నీ చెప్పవచ్చు. కానీ, ప్రపంచీకరణ తుఫానులో పడి కొట్టుకుపోతున్న సమాజాన్ని, పరాయీకరణకి గురౌతున్న సామాన్యుడిని గట్టునెక్కించగలది సాంస్కృతిక రంగం మాత్రమే. మరి అలాంటి శక్తివంతమైన సాధనాన్ని ఉన్నంతలో బలోపేతం చేసుకోవడం కర్తవ్యంగా గుర్తించాలి. పరిష్కారాల దిశగా బహుముఖంగా ప్రయత్నించాలి.

సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక సమస్యల్ని పరిమితుల్లో ఐనా నిబద్ధతగా చర్చించడానికి ఒక బలమైన మాధ్యమం రంగస్థలం. అలాంటి విశిష్టమైన ప్రక్రియని సజీవంగా ఉంచుకోవడం మనందరి ఉమ్మడిబాధ్యత. మసకబారుతున్న తెలుగు నాటక రంగాన్ని బతికించుకోవడం, ప్రత్యామ్నాయ ప్రజాతంత్ర కళా సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగమేనని గుర్తించాలి .

అందులో భాగమే ఈ చిన్నయత్నం. తెలుగు నాటక రంగాన్ని సుసంపన్నం చేసుకునే దిశగా జరుగుతున్న ప్రయత్నాల కోసం సహృద్భావ సంవాదాన్ని నిర్మించడమే ఈ రచనా కార్యక్రమం ఉద్దేశం. కళాభిమానులు, రసజ్ఞులు, రంగస్థల ప్రేమికులందరూ ఇందులో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాల్గొనాలని మనవి. మీ విలువైన సలహాలు సూచనలు మన క్రియాశీల పురోగతికి చాలా అవసరం.

అందుకే, తప్పకుండా చదవండి. ఇంకా ఆసక్తి పరులతో కూడా చదివించండి. వ్యక్తిగత, సామాజిక మార్పుకి దోహదం చేసే సమిష్టి కృషిలో మీ వంతు సహకారం అందించండి. మనందరం కలిసి చేయబోయే సమాలోచనలో ఇలా పాల్గోవడం ద్వారా వర్తమానంలోనూ, భవిష్యత్తు తరాల కోసమూ ఒక అర్థవంతమైన ఆశను నిర్మించడానికి ముందడుగేద్దాం పదండి.

సాంస్కృతిక కార్యకర్తలు, సామాజిక ఆలోచనా పరులు, సాహితీ అభిలాష పరులు, రంగస్థల ప్రముఖులు, నాటక రంగ ప్రయోక్తలు, ప్రజా కళాకారులంతా చదివి స్పందించాల్సిందిగా మనవి చేస్తూ, సెలవు.

"కళ కళ కోసం కాదు, ప్రజల కోసం !"

------0------

మా ఇతర ప్రచురణలు

1. ప్రజాస్వామ్య పతనం
2. అరాజకత్వం అంటే ఏమిటి ?
3. సాంఘిక తత్వం – వైప్లవ మార్గం
4. ఒక నాస్తికుడి నామా
5. ప్రజాస్వామ్య ప్రస్థానం
6. అస్థిత్వం – అరాజకత్వం
7. మద్యం పై యుద్ధం
8. మతానికి మరణశాసనం...
9. కరపత్రాల కథా కమామీషు
10. తత్వ విచారణ : తర్క వివేచన
11. కులానికో సవాలు
12. హేతువాద దృక్పథం: విధానపర కర్తవ్యం
13. కలాలు – కరపత్రాలు
14. ప్రకృతి – శాస్త్రం – సమాజం
15. పార్టీరహిత ప్రజాస్వామ్యం
16. శిథిలాక్షరం
17. వ్యవస్థలు – వ్యసనాలు
18. ప్రజా ఉద్యమాల ప్రాతిపదిక
19. తరగతిగది తత్వశాస్త్రం
20. అభివ్యక్తి
21. భారతదేశ పతనానికి ప్రధాన కారణం:కులం
22. మహా మానవవాద తత్వవేత్త – మానవేంద్రనాథ రాయ్
23. ఆకాశమంత అక్షరమూర్తి – డా. ఆవంత్స సోమసుందర్
    (శతజంత్యుత్సవ వ్యాస సంపుటి)
24. వాక్కులు – వాక్యాలు (పది ప్రసంగ వ్యాసాలు)
25. కార్యక్రమాలు – కార్యాచరణ (కొన్ని గుర్తుండిపోయిన సందర్భాల స్మృతులు)

ఇంటర్వ్యూలు - పరిచయాలు

26. ధిక్కార స్వరాలు (భావోద్యమకారుల ఇంటర్వ్యూలు)
27. విస్మృత స్వరాలు (గాంధేయవాదుల ఇంటర్వ్యూలు)
28. సద్ధర్మ స్వరాలు (బౌద్ధోద్యమకారుల ఇంటర్వ్యూలు)
29. దీరోదాత్తులు (కొద్దిమంది సామాజిక కార్యకర్తల పరిచయాలు)
30. సాఫల్య జీవులు (మహానుభావుల పై ప్రసంగ వ్యాసాలు)
31. మరువలేని మనుషులు:మరపురాని జ్ఞాపకాలు (కొందరు గతించిన ఆత్మీయుల స్మృతులు)
32. రాజీలేని ధిక్కార పతాకాలు (కొద్దిమంది సామ్యవాదుల పరిచయాలు)
33. మరుగునపడ్డ మహాయోధులు (కొద్దిమంది ప్రజాపక్ష బుద్ధిజీవుల పరిచయాలు)
34. ఇరువురు ఏకవ్యక్తి సైన్యాలు (విశిష్ట భావోద్యమ దంపతుల పరిచయం)
35. నిత్య చైతన్య భావోద్యమ తరంగం – దేవగుప్తపు పేరలింగం (నివాళి ప్రచురణ)
36. మార్గదర్శకులు (కొందరు మంచిమనుషుల పరిచయాలు)
37. మహామానవులు (కొద్దిమంది జిజ్ఞాసుల పరిచయాలు)
38. భావజాల సౌధాలు (కొన్ని మానవీయ సంస్థల పరిచయాలు)
39. శతస్సుమాలు (శతాధిక పుస్తకాల పరిచయాలు)

అనువాదాలు - అనుసరణలు

40. నీటిమరల గ్రామం
(అకిరా కురుసోవా విలేజ్ ఆఫ్ వాటర్మిల్స్ కి తెలుగు అక్షర రూపం)
41.పురుషుడు – స్త్రీ
(చలం ఏకైక ఆంగ్ల వ్యాసం తెలుగులో)
42. సంపూర్ణ ప్రజాస్వామ్యం దిశగా..
(లోక్నాయక్ జయప్రకాశ్ నారాయణ్ వ్యాసం)
43. శాస్త్రీయ హేతువాద సామ్యవాది : వివేకానంద
(దత్తప్రసాద్ దభోల్కర్ రచన అనువాదం)
44. సాలీడు – ఈగ
(విలియం లబ్నిష్కి పిల్లల కథ తెలుగులో)
45. నంది మూపురం
(డి.డి.కొశాంబి పిల్లల కథ తెలుగులో)

46. ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో..
(విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ కవితా విశ్లేషణ)
47. చారిత్రక మహోద్యమం : చంపారన్ సత్యాగ్రహం
(చంపారన్ శతవార్షికోత్సవ వ్యాసాలు)
48. సాంస్కృతిక ఆవశ్యకతగా స్వేచ్ఛ
(యం. యన్. రాయ్ వ్యాసం తెలుగులో)
49.మన విద్యా సమస్య
(లాలా లజపతిరాయ్ వ్యాసం)
50. జీవితానికి అర్థం ఏమిటి ?
(ఆచార్య నరేంద్రదేవ్, లోహియా వ్యాసాలు)
51.ప్రకృతి శాశ్వత ప్రగతి
(సుందర్లాల్ బహుగుణ ఇంటర్వ్యూ)
52.అభివృద్ధి – ఆదివాసులు – హింస
(హిమంశుకుమార్ హిందీ రచన తెలుగులో)
53. మనిషి – మార్జాలం
(కానర్డ్ లోర్నెంజ్ పిల్లి కథ)
54. సినిమా కార్యకర్తల కరదీపిక
(ఏ మాన్యువల్ ఫర్ ఫిల్మ్ స్క్రీనింగ్ తెలుగులో)
55. నేను – ప్రజలు – ప్రపంచం
(పిఠాపురం యువరాజా ఆత్మకథ తెలుగులో)
56. భారతదేశంలో బౌద్ధ పతనం
(అంబేద్కర్, రాహుల్జీ ల వ్యాసాలు)
57. అనారోగ్యాన్ని పండగ చేసుకుందాం
(తమిళ నమ్మల్వార్ రచన అనువాదం)
58. భారతదేశ విముక్తి మార్గం: బౌద్ధం
(డా.బి.ఆర్.అంబేద్కర్ ఐదు బౌద్ధ ప్రసంగాలు)
59.పర్యావరణ పరిరక్షణ
(సుందర్లాల్ బహుగుణ రచన)

60. మన కర్తవ్య మార్గం (గదర్ వీరుడు సోహన్ సింగ్ భాక్నా రచన)
61. సైన్స్ అంటే ఏమిటి ?
(వినోద్ రైనా, డి.పి. సింగ్ రచన తెలుగులో)
62. ఆర్.వి.కె.యం.సూర్యారావు బహదూర్
(పిఠాపురం మహారాజా జీవినచక్రం)
63. మహాత్మాగాంధీ
(ప్రొ. సచ్చిదానంద సిన్హా వ్యాసం తెలుగులో)
64. ప్రజాపక్ష మేధావి కొశాంబి
(అరవింద్ గుప్తా రచన తెలుగులో)
65. నాకో భార్య కావాలి !
(అమెరికన్ స్త్రీవాద రచయిత్రి జడీబ్రాడీ వ్యంగ్య రచన తెలుగులో)
66. ప్రజావిముక్తి ప్రదాత : డా. బి. ఆర్. అంబేద్కర్ (డా. భదంత ఆనంద్ కౌసల్యాయన్ వ్యాసం)
67. అసాధారణ ఆలోచనాపరుడు, ముస్లిం సత్యశోధక్ మండలి స్థాపకుడు : హమీద్ దల్వాయి (50 ఏళ్ళ నాటి విశిష్ట ఇంటర్వ్యూ)
68.ఈనాటి పీడితుల కోసం బీ వీర్ నారాయణ్ సింగ్ వీలునామా (అమరుడు శంకర్ గుహ నియోగి పరిశోధనాత్మక చారిత్రక రచన)
69. అమరుడు భగత్‌సింగ్
(కామ్రేడ్ మన్మధనాథ్ గుప్తా 50 ఏళ్ళ నాటి విశిష్ట రచన)
70. తెర వెనుక...(మొట్టమొదటి భారతీయ కమ్యూనిస్టు, ముస్లిం డాక్టర్ రషీద్ జహాన్ లఘు నాటిక తెలుగు అనువాదం)

సేకరణ - కూర్పు - పునర్ముద్రణ

71. ఆంధ్రరాష్ట్ర సాంఘిక సంస్కర్తలు - శతవార్షికోత్సవ సందర్భం
(పి. హెచ్. గుప్తా గారి వ్యాసం)
72. కాకినాడలో ఒక సాంఘిక సంస్కరణ - శతవార్షిక సమాలోచన
(యలమంచిలి వెంకటప్పయ్య గారి వ్యాసం)

పర్యవేక్షక/ భాగస్వామ్య ప్రచురణలు :

73. అద్వితీయ వైజ్ఞానికవేత్త, కీ. శే. యాళ్ళ సూర్యనారాయణ (పార్వతీపురం) విశిష్ట కృషి :
భావ దీపికలు (నాస్తిక, హేతువాద, భౌతికవాద సూక్తులు)
74. మైత్రేయి బుద్ధవిహార మహానిర్మాత, మహో దయ యాజరా రచనా సంపుటి : నన్ను నేను ప్రకటించుకుంటున్నా !
75. రేపటి తరం కోసం మద్యపాన వ్యతిరేక ఉద్యమం (జనవిజ్ఞాన వేదిక ముద్రణ)76. కులనిర్మూలనకై గళమెత్తిన సదస్సు !
77. ఏకవ్యక్తి సైన్యం : మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)

సంకలనం - సంపాదకత్వం

78. మద్యపానమా? మానవత్వమా?
79. మానవతకు భరోసా
80. సహృదీయం
81. పేదల కలలు (కథలు)
82. సంస్కృతి:సంక్షోభాలు–సంవాదాలు
83. ప్రత్యామ్నాయ సినిమాలు : దృక్పథాలు – దృక్కోణాలు
84. మానవీయ ఆసరా స్వరాలు...
85. భారతదేశ ప్రజలమైన మేము..
(డెబ్భై ఏళ్ళ రాజ్యాంగ విశ్లేషణ వ్యాసాలు)
86. చదువు అంటే ఏమిటి, చదువులెందుకు?
87. ప్రజలు – కళలు
88. భారతదేశంలో వందేళ్ళ కమ్యూనిజం
89. నవభారత యువదిక్సూచి భగత్సింగ్
90. కులనిర్మూలన కోసం...
91. పరాయీకరణ :పరిణామాలు – పర్యవసానాలు
92. శ్రమైక జీవన సంస్కృతి

93. ఒకే వ్యక్తి – అనేక జీవితాలు
(రాహుల్జీ పై వ్యాస సంకలనం)
94. మద్యమా ? మానవ మనుగడా?
(మద్య వ్యతిరేక కరపత్రాలు)
95. ప్రజల కోసం పాత్రికేయం : ప్రమాణాలు – ప్రభావాలు
96.పిఠాపురానికి వెలుగురేఖలు (ముగ్గురు మహనీయుల శతజయంత్యుత్సవ పరిచయం.)
97. ఆయన జీవితమే ఒక సందేశం – దరిశి చెంచయ్య (వ్యాస సంకలనం)
98. మనుషులు – వ్యసనాలు (వ్యాస సంకలనం)
99. ఉరిమే స్వేచ్ఛా స్వరం – గరిమెళ్ళ నారాయణ (90 వ జయంతి స్మారక వ్యాస సంకలనం)
100. ప్రజాపక్ష మేధావి – అరుదైన బుద్ధిజీవి : డా. గురుకుల మిత్ర , జీవితం – ఆచరణ – కృషి (వ్యాస సంకలనం)